నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 15 ఫిబ్రవరి 2025 | SURYAPET

కేసీఆర్‌ను కలిసిన బాలలక్ష్మి

రాజాపేట, ఫిబ్రవరి 14 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆ పార్టీ మహిళా విభాగం రాజాపేట మండలాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టడంతోపాటు మహిళా సమస్యలపై చైతన్యవంతంగా పని చేయాలని కేసీఆర్ సూచించినట్లు ఆమె తెలిపారు.

మాజీ సీఎం కేసీఆర్‌తో బాలలక్ష్మి


మాజీ మంత్రి హరీశ్‌రావుతో బీఆర్ఎస్ మండల నాయకులు

హరీశ్‌రావును కలిసిన మర్రిగూడ నాయకులు

మర్రిగూడ, ఫిబ్రవరి 14 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును మర్రిగూడకు చెందిన బీఆర్ఎస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. చెర్కు శ్రీరామ్‌గౌడ్, నున్సావత్ గోపీనాయక్, పొనుగోటి దేశ్‌ముఖ్‌రావు తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని హరీశ్‌రావు సూచించినట్లు తెలిపారు.

చండూరులో అర్ధరాత్రి హైటెన్షన్

కిడ్నాప్ తరహాలో బీఆర్ఎస్ నేత అన్నెపర్తి శేఖర్ అరెస్ట్

మఫ్టీలో వచ్చి తలుపులు తోసుకుంటూ వెళ్లిన పోలీసులు

- ఎవరో అర్ధం కాక భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు
- విచారణ పేరిట నల్లగొండకు తరలింపు
- పోలీసుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- ఉదయం 9 గంటల తర్వాత శేఖర్ ఆచూకీ బయటకు
- నల్లగొండ ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల
- ఆర్థిక లావాదేవీల కేసులో అరెస్టు చేశామంటున్న పోలీసులు
- అర్ధరాత్రి ఇంత హైడ్రామా ఎందుకని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ప్రభుత్వ విధానాలు, అధికార పార్టీ నేతల ఆగడాలపై ప్రశ్నించినా, నిలదీసినా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి చండూరులో బీఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్ అరెస్టు అందుకు తాజా ఉదాహరణగా నిలుస్తున్నది. ఆర్థిక లావాదేవీలో ఓ వ్యక్తితో చోటుచేసుకున్న వివాదాన్ని అవకాశంగా చేసుకుని అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర కలకలం రేపింది. అర్ధరాత్రి మఫ్టీలో వచ్చి తామెవరో చెప్పకుండా తలుపులు తోసుకుంటూ వెళ్లి శేఖర్‌ను నిర్బంధించి బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. అంత రాత్రిపూట ఎందుకు పట్టుకుపోతున్నారో, ఎక్కడికి తీసుకువెళ్తున్నారో చెప్పకపోవడంతో శేఖర్ కుటుంబసభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎవరో కిడ్నాప్ చేశారని భయపడి కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు నిద్రలేచి వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శేఖర్ ఇంటికి పెద్దసంఖ్యలో చేరుకుని ఆందోళనకు దిగారు. దాంతో శుక్రవారం ఉదయం 9 గంటల తర్వాత తామే ఆర్థిక లావాదేవీల వివాదంలో శేఖర్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించక తప్పలేదు.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ)/చండూరు :

శేఖర్‌ను వెంటనే విడుదల చేయాలని వేడుకుంటున్న శేఖర్ కుటుంబ సభ్యులు

అన్నెపర్తి శేఖర్

చండూరుకు చెందిన అన్నెపర్తి శేఖర్ బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల నేతగా ఉన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడిగా, మాజీ కౌన్సిలర్‌గా పని చేస్తూ నిత్యం ప్రభుత్వ విధానాలు, అధికార కాంగ్రెస్ పార్టీ నేతల వ్యవహార శైలిని ఎండగడుతున్నారు. దాంతో కొన్ని నెలలుగా అధికార పార్టీ నేతలు పలు రకాలుగా శేఖర్‌ను పరోక్షంగా వేధింపులకు గురిచేస్తున్నారు. పోలీసుల ద్వారానూ ఒత్తిడి చేశారు. అయినా శేఖర్ వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులను అడ్డం పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు దిగినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా చండూరుకు చెందిన చిట్టిప్రోలు మహేశ్ అనే వ్యక్తితో శేఖర్‌కు జరిగిన ఆర్థిక లావాదేవీల పంచాయితీని అడ్డం పెట్టుకుని అక్రమంగా అరెస్టు చేయించారని మండిపడుతున్నారు. అర్ధరాత్రి వచ్చి వివరాలేవీ చెప్పకుండా అరెస్టు చేసిన తీరుపై శేఖర్ కుటుంబసభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి హైడ్రామా

చండూరులోని కాస్తాల క్రాస్ రోడ్డులోని అన్నెపర్తి శేఖర్ ఇంటికి రాత్రి 3.30గంటల సమయంలో నలుగురు మఫ్టీలో ఉన్న వ్యక్తులు ప్రత్యేక వాహనంలో వచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వాళ్లు తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి ఇంటి తలుపు తట్టడంతో ఎవరని ప్రశ్నిస్తే... డోర్ తీయండి.. శేఖర్‌తో మాట్లాడాలంటూ బలవంతంగా తలుపులు తెరిపించారు. తర్వాత శేఖర్‌ను పట్టుకుని బయటకు తీసుకెళ్తుంటే ఎందుకు పట్టుకుపోతున్నారని ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. వాహనం ఎక్కిస్తుండగా వచ్చిన వ్యక్తులను నిలదీయగా తాము పోలీసులమని చెప్తూ వెళ్లిపోయారు. ఎక్కడికి తీసుకెళ్తున్నారో కూడా చెప్పలేదు. దాంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానిక బీఆర్ఎస్ నాయకులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారంతా శేఖర్ ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి శేఖర్ ఆచూకీ కోసం నిలదీశారు. ముందు తమకు ఏమీ తెలియదంటూ స్థానిక పోలీసులు చెప్పి తప్పించుకోవాలని చూశారు. అప్పటికే శేఖర్‌ను చండూరు నుంచి నల్లగొండలోని రహస్య ప్రాంతానికి తరలించారు. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. దాంతో వాళ్లు రంగంలోకి దిగి శేఖర్ ఆచూకీ కోసం పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల హుటాహుటిన నల్లగొండకు చేరుకున్నారు. ఈలోపు ఉదయం 9గంటల సమయంలో శేఖర్ తమ అదుపులోనే ఉన్నట్లు పోలీసులు వెల్లడించక తప్పలేదు. కానీ, శేఖర్ ఎక్కడ ఉన్నారో మాత్రం అప్పటికీ చెప్పలేదు.

ఎస్పీని కలిసిన కూసుకుంట్ల

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఎస్పీ కార్యాలయానికి చేరుకుని.. బంగ్లాలో ఉన్న ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను కలిశారు. శేఖర్ కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళనను వివరిస్తూ ఆచూకీ తెలుపాలని కోరారు. దాంతో నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణ కోసం ఉంచినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి ప్రభాకర్ రెడ్డి నేరుగా బీఆర్ఎస్ నేతలతో కలిసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. శేఖర్‌తో మాట్లాడి జరిగిన ఘటనపై ఆరా తీసి ధైర్యం చెప్పారు. అక్రమ కేసులతో తమ గొంతు నొక్కలేరని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మీడియాతో మాట్లాడుతూ కూసుకుంట్ల హెచ్చరించారు. మధ్యాహ్నం తర్వాత చండూరు పోలీసులు శేఖర్‌ను కోర్టులో హాజరు పరిచారు.

అర్ధరాత్రి ఏమీచెప్పకుండా ఎత్తుకుపోయారు

'అర్ధరాత్రి మా ఇంటికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మమ్మల్ని నిద్ర లేపి మా ఆయన శేఖర్‌ను ఎత్తుకుపోయారు. ఎవరు మీరు? ఇంత రాత్రి ఎందుకు వచ్చారని ఎన్ని సార్లు అడిగినా చెప్పలేదు. తలుపులు తోసుకుంటూ లోపలికి వచ్చారు. ఎంత చెప్పినా వినకుండా మమ్మల్ని నెట్టేసి మా ఆయన్ని లాకొన్ని వెళ్లి వాహనంలో ఎక్కించారు. అప్పుడు గట్టిగా నిలదీస్తే మేం పోలీసులం అంటూ వెళ్లిపోయారు. ఇంత రాత్రిపూట వివరాలు చెప్పకుండా ఎలా పట్టుకుపోతున్నారు? నా భర్త అక్రమ అరెస్ట్‌పై హైకోర్టుకు వెళ్తాను. తన భర్తకు ఎలాంటి హాని జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుంది. నా భర్తను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.'

-సంతోష, శేఖర్ భార్య

అక్రమ కేసులతో కక్ష సాధింపు

'అన్నెపర్తి శేఖర్‌పై అక్రమ కేసులతో కక్ష సాధింపు చర్యలకు దిగారు. ఇలాంటి కేసులకు భయపడి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మానం. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతున్న శేఖర్ అరెస్టు చేయడం అధికార పార్టీ నేతల కుట్రలో భాగమే. ఓ వ్యక్తితో ఉన్న డబ్బుల పంచాయితీ అయితే అర్ధరాత్రి అరెస్టు చేయాల్సిన అవసరం ఏంటి? కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తూ, కార్యకర్తలను బెదిరించేలా పోలీసులు వ్యవహరించడం తగదు. శేఖర్‌ను తక్షణమే విడుదల చేయాలి.'

-బొమ్మరబోయిన వెంకన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు

ఆర్థిక లావాదేవీల కేసులో అరెస్టు అంటూ ఎస్ఐ ప్రకటన

ఇంత హైడ్రామా క్రియేట్ చేస్తూ అర్ధరాత్రి అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం సాయంత్రం వాట్సాప్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన చూసినవాళ్లు ఇంతదానికి అర్ధరాత్రి అరెస్టు, హైడ్రామా క్రియేట్ చేయడం అవసరమా అని ఆశ్చర్యం వ్యక్తం చేయడం కనిపించింది. 'చండూరు గ్రామానికి చెందిన చిట్టిప్రోలు మహేశ్ అనే వ్యక్తితో అదే గ్రామానికి చెందిన అన్నెపర్తి శేఖర్ అనే వ్యక్తి డబ్బుల విషయంలో అకారణంగా గొడవ పడి కొట్టి, బూతులు తిట్టి, బెదిరించాడు. దాంతో మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడైన అన్నెపర్తి శేఖర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడమైంది' అంటూ పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి

- లోఓల్టేజీతో మోటార్లు కాలి పంటలు ఎండుతున్నయ్
- మాజీ ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి

తుర్కపల్లిలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

తుర్కపల్లి, ఫిబ్రవరి 14 : వ్యవసాయానికి ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగానికి 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించడంతో రైతులు రందిలేకుండా పంటలు సాగు చేసుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే విద్యుత్ సంక్షోభం ఏర్పడడం దారుణమన్నారు. కరెంట్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలతో విద్యుత్ మోటర్లు కాలిపోతుండడంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీజన్‌కు రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవని, ఇప్పుడు రైతు భరోసా ఎవరి ఖాతాలో పడుతున్నాయో, ఎంత పడుతున్నాయో తెలియని గందరగోళం నెలకొందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వకుండా కోతలు విధిస్తూ రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ యాకుబ్, బాలకృష్ణ, మోతీరాం, నర్సింహ్మ, భిక్షపతి పాల్గొన్నారు.

యడవెల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌తో మాట్లాడుతున్న రైతులు

కేసీఆర్ పాలనే బాగుంది | నీళ్లు, కరెంటుకు ఢోకా లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లివ్వకుండా పంటలను ఎండబెడుతున్నది
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో రైతులు

నూతనకల్, ఫిబ్రవరి 14 : కేసీఆర్ పాలనే బాగుందని, మళ్లీ బీఆర్ఎస్ సర్కారు రావాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మండలంలోని యడవెల్లి గ్రామానికి శుక్రవారం వచ్చారు. ఆయన్ని చూసి గ్రామ రైతులు చుట్టూ చేరి మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వమే బాగుందని చెప్పుకొచ్చారు. ఎకరానికి రూ.18 వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంలో నీళ్లున్నా ఎస్సారెస్పీ కాల్వలకు వదలడం లేదని వాపోయారు. బోర్లు కూడా వట్టిపోవడంతో కండ్ల ముందే పంటలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నీళ్లకు, కరెంటు ఢోకా లేదని, అప్పుడే అంతా బాగుందని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఎన్నికలు పెట్టినా మీరే ఎమ్మెల్యే అవుతారని సంతోషంగా తెలిపారు.

ప్రశ్నిస్తే తప్పుడు కేసులు.. అక్రమ అరెస్టులా?

ప్రజా పాలన ముసుగులో రాక్షస పాలన

- బీఆర్ఎస్ నేత అన్నెపర్తి శేఖర్ అక్రమ అరెస్టు అన్యాయం
- మంత్రి పదవి రాలేదని దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నీలగిరి, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో ప్రజా పాలన ముసుగులో రాక్షస పాలన చేస్తున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తే తప్పులు కేసులు పెట్టి, అక్రమ అరెస్టులకు పాల్పడుతారా అని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం అర్ధరాత్రి చండూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేత అన్నెపర్తి శేఖర్‌ను అక్రమంగా అరెస్టు చేశారంటూ శుక్రవారం ఉదయం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో కూసుకుంట్ల మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనను మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించే నాయకులను టార్గెట్ చేస్తూ దాడులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి మరిచి బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత దాడులకు ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. మంత్రి పదవి రాకపోవడంతో సహనం కోల్పోయి గడ్డం పెంచుకుని, లుంగీలు కట్టుకుని తిరుగుతున్నాడని, శాశ్వతంగా మంత్రి పదవి రాకుంటే ఏం చేస్తాడో ప్రజలు ఆలోచించాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజరవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు తెస్తే ఇప్పుడున్న ఎమ్మెల్యే కొంతమందికే ఎమ్మెల్యే అన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రశ్నించే నాయకులను ఇబ్బందులకు గురిస్తున్నారని మండిపడ్డారు. చట్టం పోలీస్ యంత్రాంగంపై తమకు గౌరవం ఉందని, న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. శేఖర్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన అక్రమ అరెస్టును ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. అనంతరం నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అన్నెపర్తి శేఖర్‌ను ఆయన కలిసి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మునగాల నారాయణరావు, గుర్రం వెంకట్‌రెడ్డి, కస్తాల వెంకన్న, పోలగాని సైదులుగౌడ్ ఉన్నారు.

ఆర్డీఓ సంతకం ఫోర్జరీ

- నకిలీ సంతకాలు, స్టాంపులతో అక్రమంగా ప్లాట్ల విక్రయం
- రియల్టర్ అరెస్ట్, పరారీలో మరొకరు

సుర్వి అంజయ్య(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 14 : ఆర్డీఓ సంతకాలను ఫోర్జరీ చేసిన చౌటుప్పల్ పట్టణానికి చెందిన రియల్టర్ వ్యాపారి సుర్వి అంజయ్య, ఐతగోని రాఘవేందర్‌పై శుక్రవారం చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అంజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఐతగోని రాఘవేంద్ర పరారీలో ఉన్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన సుర్వి అంజయ్య(50) గతంలో చౌటుప్పల్ ఆర్డీఓగా పని చేసిన మహేందర్‌రెడ్డి సంతకాలను చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన ఐతగోని రాఘవేంద్ర(45) సాయంతో పోర్జరీ చేసి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లుగా విక్రయించాడు. చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 288/ఏ3/2,289ఏ1/2 నుంచి ఐదెకరాల భూమిని బోరెం భిక్షరెడ్డి, వెంకటరాంరెడ్డి నుంచి కొనుగోలు చేసి గ్రామపంచాయతీ పర్మిషన్‌తో ప్లాట్లు విక్రయించారు. 2024 జులై నుంచి నాలా పర్మిషన్ తప్పనిసరి అవడంతో, తమ స్నేహితుల సాయంతో అప్పటి చౌటుప్పల్ ఆర్డీఓ మహేందర్‌రెడ్డి సంతకాలు ఫోర్జరీ చేయడంతోపాటు ఆర్డీఓ కార్యాలయం స్టాంపులను తయారుచేసి నకిలీ నాలా కన్వర్షన్ కాపీలను తయారు చేశారు. నకిలీ పత్రాలతో చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించి అక్రమంగా ప్లాట్లు విక్రయించారు. దీనిపై చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి విచారణ చేసి ఫోర్జరీ జరిగినట్లు నిర్ధారించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన చౌటుప్పల్ సీఐ మన్మదకుమార్ సుర్వి అంజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏ2గా ఉన్న ఐతగోని రాఘవేంద్ర పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చేనేత పొదుపులో కోతలు

భారీగా ఖర్చు తగ్గించుకునేందుకు సర్కారు ప్లాన్

చేనేత కార్మికులకు ఆసరాగా నిలిచే పొదుపు పథకంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు పెట్టింది. అనుబంధ కార్మికుల చెల్లింపుల వాటా కుదించింది. గతానికి భిన్నంగా అనుబంధ కార్మికుడిని ఒక్కరికే పరిమితం చేసింది. అంతేకాకుండా గతంలో పథకం వ్యవధి మూడు సంవత్సరాలు ఉండగా, ఈసారి రెండేండ్లకు కుదించింది. దాంతో సర్కారుపై నేతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)/భూదాన్ పోచంపల్లి

- గత బీఆర్ఎస్ పథకానికి పలు మార్పులు
- అనుబంధ కార్మికుడి చెల్లింపుల వాటా కుదింపు
- స్కీమ్‌లో అనుబంధ కార్మికులు ఒక్కరికే పరిమితం
- పథకం వ్యవధి మూడేండ్ల నుంచి రెండేండ్లకు తగ్గింపు
- ప్రభుత్వానికి ఏటా రూ.కోట్లలో ఆదా.. కార్మికులకు మాత్రం నష్టం
- మండిపడుతున్న చేనేత కార్మికులు

నేతన్నలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటూ అండగా నిలిచింది. బతుకుదెరువు కోసం వలసలు వెళ్లిన కార్మికులు తిరిగి స్వగ్రామాలకు వచ్చి ఉపాధి పొందేలా చేయూతనిచ్చింది. నేతన్నల సామాజిక భద్రత కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేనేత పొదుపు పథకానికి శ్రీకారం చుట్టారు. 2017, 2021లో విజయవంతంగా పథకం కొనసాగించారు. నేతన్నలకు ఆర్థికంగా ఎంతో ఆసరాగా నిలిచారు. 2021-2024 సంవత్సరానికిగానూ యాదాద్రి భువనగిరి జిల్లాలో 11వేల మంది కార్మికులు చేనేత పొదుపులో నమోదు చేసుకున్నారు. వారందరికీ స్కీమ్ వ్యవధి ముగిశాక ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల వరకు సాయం అందింది.

అనుబంధ కార్మికుడి వాటా తగ్గింపు

అనుబంధ కార్మికుడికి కోత అలా ఉండగా, ఉన్న ఒక్కరికి కూడా వాటా తగ్గించారు. వాస్తవానికి నేత కార్మికుల నెలవారీ ఆదాయంలో 8 శాతం ఆర్డీ-1లో జమ చేసిన తర్వాత.. ప్రభుత్వం ఆర్డీ-2లో 16శాతాన్ని నేరుగా జమ చేస్తుంది. ఆ మొత్తం నగదు వడ్డీ సహా గడువు ముగిశాక కార్మికులకు అందుతుంది. ఉదాహరణకు గతంలో కార్మికుడు రూ.1,200 వాటా చెల్లిస్తే.. అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లించేది. ఇప్పుడు అనుబంధ కార్మికుడికి రూ.600కి తగ్గించారు. దీని ద్వారా ప్రభుత్వం నెలకు రూ.400 వరకు చెల్లించకుండా తప్పించుకుంటున్నది. ఇలా అనుబంధ కార్మికుడికి ఏడాదికి రూ.4,800 నష్టం జరుగుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 10 వేల మంది వరకు అనుబంధ కార్మికులు ఉండగా, ఏటా రూ. 5కోట్ల వరకు నేతన్నలకు అందాల్సిన సాయం దక్కకుండా పోతుంది.

మూడేండ్ల నుంచి రెండేండ్లకు..

గతంలో పొదుపు పథకానికి మూడేండ్ల వ్యవధి ఉండేది. 36 నెలలపాటు చేనేత కార్మికులు తమ వాటా చెల్లిస్తే ప్రభుత్వం డబుల్ ఇచ్చేది. మూడేండ్ల తర్వాత పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చేవి. ఇప్పుడు రెండు సంవత్సరాలు మాత్రమే కావడంతో కార్మికులకు తక్కువ అమౌంట్ వస్తుంది. ప్రభుత్వానికి చెల్లింపులు తగ్గే అవకాశం ఉంది. ఇక ఈ నెల ఒకటో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. శనివారం(నేడు) గడువు ముగియనుంది. 16 నుంచి ధ్రువీకరణ ప్రారంభమవుతుంది.

అనుబంధ కార్మికుల కుదింపు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గతేడాది ఆగస్టు 31న పథకం గడువు ముగిసింది. అప్పటి నుంచి ప్రభుత్వం తాత్సారం చేస్తూ వచ్చింది. చేనేత కార్మికుల్లో వ్యతిరేకత రావడంతో ఇటీవల మళ్లీ పథకాన్ని ప్రారంభించింది. గతంలో ఉన్న నేతన్నకు చేయూత అనే పేరు స్థానంలో తెలంగాణ చేనేత అభయహస్త పథకం అని పేరు పెట్టింది. పేరు ఎలా ఉన్నా పథకంలో మాత్రం చాలా కోతలు పెట్టింది. గతంలో కార్మికుడితోపాటు ఇద్దరు అనుబంధ కార్మికులకు(1+2) పొదుపు పథకంలో అవకాశం కల్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అధికంగా 1+2 ఉన్నారు. గతంలోనూ అనేక మంది దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందారు. ఇప్పుడు మాత్రం ఒక్కరికే అవకాశం కల్పించారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. ప్రస్తుతానికి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకోవడం లేదని, రెండో విడుతలో చాన్స్ ఉండొచ్చు అంటూ సమాధానం దాటవేస్తున్నారు. దీని ద్వారా అనుబంధ కార్మికుడు నెలకు రూ.1,600 వరకు నష్టపోనున్నారు. సంవత్సరానికి ఒక్కో అనుబంధ కార్మికుడికి రూ. 19వేలకుపైగా నష్టం వాటిల్లనుంది.

పథకంలో కోతలు పెట్టిండ్రు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మగ్గంపై చేనేత కార్మికుడితోపాటు ఇద్దరు అనుబంధ కార్మికులకు పొదుపు పథకంలో అవకాశం ఉండేది. డబ్బులు ఎక్కువ రావడంతో నేతన్నలకు చేయూతగా ఉండేది. ఇప్పుడు కార్మికుడితోపాటు ఒక్క అనుబంధ కార్మికుడికే అవకాశం ఇచ్చారు. పథకాన్ని కూడా మూడు నుంచి రెండు సంవత్సరాలకు కుదించారు. పథకంలో అన్నీ షరతులే పెట్టిండ్రు.

-పెండెం విష్ణు, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు చేస్తాం

త్రిఫ్ట్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 వరకు అవకాశం ఉంది. కార్మికులు దరఖాస్తు చేసుకున్నాక క్షేత్రస్థాయిలో మగ్గాలను పరిశీలన చేసి ఆర్డీ అకౌంటును ప్రారంభిస్తాం. కొత్త మగ్గాలకు కూడా జియో ట్యాగింగ్ ఇస్తాం. నిరంతరం పని చేస్తూ ఉండాలి. అక్రమాలకు తావు లేకుండా నిజమైన చేనేత కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- పద్మ, రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్